ప్రజాశక్తి
ఆదివారం 20 జులై 2025 | 5 | అనంతపురం

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి

బ్రాండెడ్ మాటున నకిలీ..!

యథేచ్ఛగా నకిలీ వాటర్‌బాటిళ్ల విక్రయాలు
శుద్ధి ప్రక్రియలో నిబంధనలు ఉల్లంఘన
ప్రజారోగ్యంతో చెలగాటం

ప్రయివేటు నీటిశుద్ధి కేంద్రాల నిర్వాహకులు ప్రజారోగ్యాన్ని ఫణంగా పెట్టి కాసుల వేట సాగిస్తున్నారు. కనీస ప్రమాణాలు, నిబంధనలు పాటించకుండా ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ పేరుతో అక్రమాలకు పాల్పడుతున్నారు. ప్రముఖ బ్రాండ్లు బిస్లరీ, కిన్లీ పేర్లలో కొన్ని అక్షరాలను అటు ఇటు మార్చేసి మోసం చేస్తున్నారు. దాహం తీర్చుకునేందుకు ఓ వాటర్ బాటిల్ కొంటే అది బ్రాండెడ్ వాటర్ బాటిల్‌ను పోలి ఉంటుంది. అదే కలర్.. అచ్చం అలాంటి లోగో. అయితే కేవలం ఒకటి రెండు అక్షరాలు మాత్రం తేడా ఉంటుంది. అదే బ్రాండెడ్ వాటర్ బాటిల్ అని చెప్పి అంటగడుతుంటారు. తెలియని వాళ్లు ఆ బాటిలే కొనుక్కుని తాగుతుంటారు. అది పూర్తిగా నకిలీ. వ్యాపారులు అధిక ధనార్జనే ధ్యేయంగా తక్కువ రేటు నకిలీ బ్రాండ్ బాటిళ్లను అంటగడుతున్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. ఇదంతా బహిరంగంగా సాగుతున్నా.. అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని పలు రెస్టారెంట్లు, బస్టాండ్లు, బేకరీల్లో నకిలీ బ్రాండ్లే అధికంగా కనిపిస్తున్నాయి.

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రయివేటు నీటిశుద్ధి కేంద్రాల నిర్వాహకులు ప్రజారోగ్యాన్ని ఫణంగా పెట్టి కాసుల వేట సాగిస్తున్నారు. కనీస ప్రమాణాలు, నిబంధనలు పాటించకుండా ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ పేరుతో అక్రమాలకు పాల్పడుతున్నారు. ప్రముఖ బ్రాండ్లు బిస్లరీ, కిన్లీ పేర్లలో కొన్ని అక్షరాలను అటు ఇటు మార్చేసి మోసం చేస్తున్నారు. దాహం తీర్చుకునేందుకు ఓ వాటర్ బాటిల్ కొంటే అది బ్రాండెడ్ వాటర్ బాటిల్‌ను పోలి ఉంటుంది. అదే కలర్.. అచ్చం అలాంటి లోగో. అయితే కేవలం ఒకటి రెండు అక్షరాలు మాత్రం తేడా ఉంటుంది. అదే బ్రాండెడ్ వాటర్ బాటిల్ అని చెప్పి అంటగడుతుంటారు. తెలియని వాళ్లు ఆ బాటిలే కొనుక్కుని తాగుతుంటారు. అది పూర్తిగా నకిలీ. వ్యాపారులు అధిక ధనార్జన ఆశతో తక్కువ రేటు నకిలీ బ్రాండ్ బాటిళ్లను అంటగడుతున్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. ఇదంతా బహిరంగంగా సాగుతున్నా.. అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని పలు రెస్టారెంట్లు, బస్టాండ్లు, బేకరీల్లో నకిలీ బ్రాండ్లే అధికంగా కనిపిస్తున్నాయి.

బ్రాండెడ్ ముసుగులో దందా..

ఉమ్మడి జిల్లా లో బిస్లరీ, కిన్లీ బ్రాండ్లను పోలి ఉన్న బాటిళ్లను పలుచోట్ల అధికంగా విక్రయిస్తున్నారు. నిత్యం 5 వేల వరకు బాటిళ్ల సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ లో తయారైన లేబుల్స్ ను తీసుకొచ్చి ఇక్కడి బాటిళ్లకు అతికిస్తున్నారు. బ్రాండెడ్ కు ఏమాత్రం తీసిపోని అచ్చం అదేవిధంగా ఉండే లేబుల్స్ తయారు చేయించి వాటర్ బాటిళ్లకు అతికిస్తున్నారు. అనంతపురం, గుంతకల్లు, మడకశిర, హిందూపురం, పుట్టపర్తి, ధర్మవరం, పెనుకొండ తదితర ప్రాంతాల్లో ఈ నకిలీ వాటర్ బాటిళ్ల తయారీ యథేచ్ఛగా జరుగుతోంది.

ఆర్టీసీ బస్టాండ్లలో అధిక విక్రయాలు

బస్టాండ్లలో విక్రయించే వాటర్ బాటిళ్లలో అసలు ఏదో.. నకిలీ ఏదో.. అంత సులువుగా కనుక్కోలేని పరిస్థితి నెలకొంది. బస్టాండ్లలో బ్రాండెడ్‌ను పోలిన నకిలీ వాటర్ బాటిళ్లను అంటగడుతున్నారు. ఈ నకిలీ వాటర్ బాటిళ్ల గుట్టు తెలిసినవారు బ్రాండెడ్ వాటర్ బాటిల్ అడిగితే అలాంటి వారికి ఇచ్చేందుకు తక్కువ సంఖ్యలో బ్రాండెడ్ బాటిళ్లను ఉంచుకుంటున్నారు. లీటరు బ్రాండెడ్ వాటర్ బాటిల్ ధర వ్యాపారులకు రూ.16 ఉంటుంది. దానిని రూ.20కు విక్రయిస్తే రూ.4 లాభం వస్తుంది. అర లీటరు బాటిల్ ధర రూ.8 ఉండగా రూ.10కి విక్రయిస్తే రూ.2 మాత్రమే లాభం వస్తుంది. బ్రాండెడ్‌ను పోలిన నకిలీ బాటిల్ లీటరు హోల్‌సేల్ ధర రూ.9.80. అరలీటరు రూ.4.50కే లభిస్తున్నాయి. వీటిని కూడా లీటరు రూ.20, అర లీటరు రూ.10కి విక్రయిస్తున్నారు. విపరీతమైన లాభం ఉండడంతో వ్యాపారులు లోకల్ వాటర్ బాటిళ్లనే ప్రయాణికులకు, ప్రజలకు అంటగడుతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆర్టీసీ బస్టాండ్ పరిధిలో 700కుపైగా దుకాణాలున్నాయి. వీటిలో 400కుపైగా దుకాణాల్లో ఈ లోకల్ వాటర్ బాటిళ్ల విక్రయాలు అధికంగా సాగిస్తున్నారు. ఒక్కో దుకాణంలో రోజుకు 10 నుంచి20 కేసుల వాటర్ బాటిళ్లను అమ్ముతున్నారు.

పెనుకొండ పారిశ్రామిక ప్రాంతంలో అధికం

పెనుకొండ కియా కార్ల పరిశ్రమ, పారిశ్రామిక ప్రాంతాల్లో నకిలీ వాటర్ బాటిళ్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి లారీలు, కంటైనర్ల డ్రైవర్లు క్లీనర్లు ఇక్కడికి అధికంగా వస్తుంటారు. వారికి నకిలీ బ్రాండ్లు ఉన్న వాటర్ బాటిల్ విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. కిన్లే, బిస్లరీ, టాటా కాపర్ తదితర బ్రాండ్లను పరిమిత సంఖ్యలో ఉంచి నకిలీలని ఎక్కువగా విక్రయిస్తున్నారు.

కియా పరిశ్రమలో మాత్రం కేవలం బిస్లరీ, కిన్లే వాటర్ బాటిల్ తప్ప ఇతర బ్రాండ్లను వారు అనుమతించరు. కదిరికి చెందిన ఏజెన్సీ నిర్వాహకులు బిస్లరీ వాటర్ బాటిల్ సరఫరా చేస్తున్నారు. పెనుగొండ చెందిన మరో ఏజెన్సీ నిర్వాహకులు కిన్లే వాటర్ బాటిళ్లను కియాకు సరఫరా చేస్తున్నారు. అనుబంధ సంస్థలు వేరే హౌస్ లు తదితర సంస్థలకు నకిలీ బ్రాండ్లని సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది.

రూ.లక్షల్లో ఆదాయం..

ఒక్కో కేసు బాక్సుకు లీటర్ బాటిళ్లు 12, అరలీటరువి 24 చొప్పున ఉంటాయి. ఒక్కో దుకాణంలో రోజుకు సరాసరి 10 కేసుల లోకల్ వాటర్ బాటిళ్లు విక్రయించినా వాటిద్వారా ఎమ్మార్పీలోనే రూ.1440 అదనంగా ఆదాయం వస్తోంది. ఈలెక్కన ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 400 దుకాణాల్లోనూ సాగే లోకల్ వాటర్ బాటిళ్ల విక్రయాల ద్వారా రోజుకు రూ.5.76 లక్షలు ఆదాయం వస్తోంది. నాణ్యతలేని లోకల్ వాటర్ బాటిళ్ల ద్వారా ప్రయాణికుల ఆరోగ్యం, జేబును గుల్ల చేస్తూ వ్యాపారులు పెద్దఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నకిలీ వ్యవహారం బహిరంగంగానే సాగుతున్నా ఆహార భద్రత, తూనికలు-కొలతల శాఖాధికారులు గానీ, ఆర్టీసీ యంత్రాంగంగానీ చర్యలు చేపట్టడం లేదు. నామమాత్రపు తనిఖీలకే పరిమితమవు తున్నారరన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఈ నకిలీ దందాకు అడ్డుకట్ట వేయాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

నకిలీ బ్రాండ్ల తయారీ వాటర్ ప్లాంట్లను సీజ్ చేయాలి

ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న నకిలీ బ్రాండ్ల తయారీ వాటర్ ప్లాంట్లను సీజ్ చేయాలి. అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి ప్రమాణాలు విధిగా పాటించే విధంగా చర్యలు చేపట్టాలి.

బాబావలి,
సిఐటియు నాయకులు

తరచూ తనిఖీలు చేస్తున్నాం

తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నాం. నిబంధనలు, ప్రమాణాలు పాటించని నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తున్నాం. మా దృష్టికి వస్తే తగిన చర్యలు తీసుకుంటున్నాం.

తస్లిమా,
ఫుడ్ ఇన్స్‌పెక్టర్

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. ప్రభాకర్ రెడ్డి, వి. రాంభూపాల్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా ఉద్యమిద్దామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. ప్రభాకర్‌రెడ్డి, రాంభూపాల్ పిలుపునిచ్చారు. సిపిఎం పార్టీ జిల్లా కార్యాలయంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాయకులు ఎం బాల రంగయ్య అధ్యక్షతన జరిగిన జరిగిన పార్టీ విస్తృత సమావేశంలో కె. ప్రభాకర్‌రెడ్డి, రాంభూపాల్ మాట్లాడారు. ప్రతి ఇంటిలో దోపిడీకి ఆస్కారం కలిగించే విధంగా ఆదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించి ప్రజలపై భారం మోపుతున్నారన్నారు. మోడీ ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయి గత వైసిపి ప్రభుత్వం స్మార్ట్‌మీటర్లకు ఒప్పందాలు చేసుకుని, అదాని సంస్థకు టెండర్లను కట్టబెట్టి, భారీ కుంభకోణానికి పాల్పడిందని విమర్శించారు. ఆనాడు స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని పిలుపునిచ్చిన కూటమి నాయకులు ప్రస్తుతం అధికారంలోకి రాగానే స్మార్ట్ మీటర్లను బిగించాలని ఆదేశాలు ఇవ్వటంతోపాటు, స్మార్ట్ మీటర్ల ఒప్పందాలను రద్దు చేయకుండా వాటిని కొనసాగించడం రాష్ట్రప్రజలకు నమ్మకద్రోహం చేసినట్లేనని అన్నారు. స్మార్ట్‌మీటర్లు బిగించిన అనంతరం షాపులు, చిన్నపరిశ్రమలు రెండు, మూడు రెట్లు, కొందరికి 10రెట్లు ఛార్జీలు పెరిగాయన్నారు. మీటర్లకు అయ్యే ఖర్చు రూ.10వేల-17వేల వరకు దశలవారీగా వినియోగదారులమైన మోపడం మరింత దారుణమన్నారు. ప్రీపెయిడ్ మీటర్ల వల్ల అందరిపై అధిక భారం పడుతుంది. కరెంట్ బిల్లులు ఆన్‌లైన్‌లో పంపడం వల్ల బిల్లులకు జవాబుదారీతనం ఉండదని అన్నారు. అదానీ స్మార్ట్ మీటర్లు, సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు. పాత మీటర్లనే కొనసాగిస్తూ, పాత రీడింగ్ పద్ధతినే అమలు చేయాలన్నారు. షాపులు, సంస్థలకు పెట్టిన స్మార్ట్ మీటర్లు తొలగించాలని, సర్దుబాటు ఛార్జీలు పూర్తిగా రద్దు చేసి బిల్లులు తగ్గించాలని కోరారు. ఈ మేరకు విద్యుత్ వినియోగదారులను సిపిఎం చైతన్యం చేస్తోందన్నారు. వివిధ ప్రజా సంఘాలు, ఐక్యవేదికల ద్వారా స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమానికి సిపిఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.సావిత్రి ఎస్ నాగేంద్ర కుమార్, వి.రామిరెడ్డి, ఆర్ చంద్రశేఖర్ రెడ్డి, ఎం కృష్ణమూర్తి, జిల్లా కమిటీ సభ్యులు వెంకటనారాయణ, ముత్తుజా, టి రామాంజనేయులు, వి నిర్మల, ఎం నాగమణి, సాకే నాగరాజు, మారుతి ప్రసాద్,కే భాస్కర్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

రద్దయినా చేయండి ...పనులైనా చేయించండి

స్టాండింగ్ కమిటీ సభ్యుల సూటి ప్రశ్న

ప్రజాశక్తి - అనంతపురం కార్పొరేషన్

స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్

నగరంలో అభివృద్ధి పనులు జరగడం లేదు. కాంట్రాక్టర్లకు బిల్లులు రాలేదని పనులు చేపట్టటం లేదు. పనులు రద్దు అయినా చేయండి లేకుంటే పనులైన చేయించండి అని స్టాండింగ్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు శనివారం మేయర్ ఛాంబర్‌లో స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. మేయర్ మహమ్మద్ వసీం సలీం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిషనర్ బాలస్వామి, సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజశేఖర్, డిప్యూటీ కమిషనర్ పావని, ఇన్‌ఛార్జి హెల్త్ ఆఫీసర్ రంగస్వామి, రెవెన్యూ అధికారులు, టిపిఒ శిరీష వివిధ విభాగాల అధికారులు, స్టాండింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు ఈసందర్భంగా స్టాండింగ్ కమిటీ సభ్యులు నరసింహులు తదితరులు మాట్లాడుతూ రూ. 23 కోట్ల రూపాయల టెండర్‌ను రద్దుచేసి కొత్తగా రూ. 17 కోట్లతో నిర్వహించిన కంపోస్ట్ యార్డ్ బయో మైనింగ్ పనులు పర్యవేక్షణ బాధ్యతలు మున్సిపల్ అధికారులను కాదని పబ్లిక్ హెల్త్‌కు అప్పగించాల్సిన అవసరం ఏమిటని నిలదీశారు. కంపోస్టు యార్డులో బయో మైనింగ్ పనులు పర్యవేక్షించేందుకు అవసరమైన సిబ్బంది, అధికారులు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉన్నారన్నారు. పబ్లిక్ హెల్త్ లో సిబ్బంది కొరత ఉండగా వారికి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. పబ్లిక్ హెల్త్ లో ముగ్గురు డిఈ లు ఉండగా మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆరుగురు డీఈలు ఉన్నారని చెప్పారు. నగరపాలికలో వైసిపి పాలకవర్గం ఉందని కుట్రపూరితంగా పబ్లిక్ హెల్త్ కు అప్పగించారని విమర్శించారు. దీనిపై కమిషనర్ బాలస్వామి స్పందిస్తూ పబ్లిక్ హెల్త్ అధికారులు అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు మరో నాలుగు మున్సిపాలిటీలలో బయోమైనింగ్ పనులను పర్యవేక్షిస్తారని అయితే పనులన్నీ మున్సిపల్ అధికారులు కనుసన్నలలోనే జరుగుతాయని వివరించారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులు ప్రభుత్వం నుంచి వెలువడ్డాయని చెప్పారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో ఒకే ఒక్కరు మాత్రమే పనిచేస్తున్నారని 14 మంది ఉండాల్సిన చోట ఒక్కరే ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. నగరంలో అక్రమ కట్టడాలు విపరీతంగా పెరిగాయన్నారు అనంతరం మేయర్ మహమ్మద్ వసీం సలీం మాట్లాడుతూ నగరంలో రహదారులు గుంతల మయంగా మారాయని అన్నారు కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు టెండర్లు పిలవటమే కానీ పనులు మాత్రం జరగడం లేదన్నారు. కాంట్రాక్టర్లు బిల్లులు రాలేదని పనులు చేపట్టడం లేదన్నారు పనులు చేపట్టకుంటే రద్దయిన చేయాలని లేకుంటే పనులైనా చేయించాలని అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులకు తాము ఆమోదం చెప్పకుంటే పనులు జరగవని అయితే తాము ఎప్పుడూ అభివృద్ధి విషయంలో కొంతమంది వ్యక్తులు మాదిరిగా రాజకీయం చేయలేదని చెప్పారు. ఫైల్ వచ్చిందే తడవుగా ఆమోదం తెలిపి పంపుతున్నామన్నారు. అయితే స్థానిక ఎమ్మెల్యే అసత్య ప్రచారాలు చేస్తూ తమ ప్రతిష్టకు భంగం కలిగించాలని చూడటం సరికాదని అన్నారు.

జెఎన్‌టియు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మాట్లాడుతున్న అతిథి

అనంతపురం : నగరంలోని జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉపకులపతి హెచ్.సుదర్శనరావు ఆన్‌లైన్ ద్వారా హాజరై మాట్లాడుతూ కళాశాలలో అనేక మంది అధ్యాపకులు, గొప్ప అనుభవజ్ఞులు ఉన్నారని కొనియాడారు. ఇక్కడ చదివిన విద్యార్థులు ఇతర దేశాల్లో ఉద్యోగం చేయడంతో కళాశాలకు మంచి గుర్తింపు వచ్చిందన్నారు. మీ సలహాలు, సూచనలను ప్రస్తుత విద్యార్థులకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఒఎస్‌డి వీసీ ఎన్.దేవన్న, కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, ఆచార్యులు పి.సుజాత, సి.శోభాబిందు, జి.ప్రశాంతి, ఎపి శివకుమార్, ఎం.విజయకుమార్, ఎ.ఆనందరావు, కెబి చంద్రశేఖర్, భువనవిజయ, వి.సుమలత, ఇ.కేశవరెడ్డి, కె.మాదవి, అరుణకాంతి, చంద్రమోహన్‌రెడ్డి, కళ్యాణ్ కుమార్, జితేంద్రగౌడ్, కళ్యాణిరాదా, భారతి, అజిత, శ్రీనివాసులు, ఓంప్రకాష్, కేశవరెడ్డి, మాజీ ఆచార్యులు వి.శంకర్, పూర్వ విద్యార్థులు, పాల్గొన్నారు.

జలహారతి ఇస్తున్న స్థానిక ఎమ్మెల్యే, విప్ కాలవ శ్రీనివాసులు

తుంగభద్ర జలాలకు జలహారతి

ప్రజాశక్తి - బొమ్మనహాల్

మండల పరిధిలోని తుంగభద్ర ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న తుంగభద్ర జలాలకు రాయదుర్గం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు శనివారం సాయంత్రం జల హరతి ఇచ్చారు అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తుంగభద్ర జలాలు ఆంధ్ర సరిహద్దులోకి వచ్చాయన్నారు. గత సంవత్సరం జలాశయం నుండి హెచ్‌ఎల్సీ కి 32 టీఎంసీలు నీటిని తీసుకోవడం చరిత్రలో మొదటిసారి అని చెప్పారు. సెంట్రల్ ట్రిబ్యునల్ కమిటీ తీర్మానం మేరకు హెచ్‌ఎల్‌సికి 23 టీఎంసీలు కేటాయించారున్నారు. అయితే బాగా వర్షాలు వస్తాయని వాతావరణ శాఖ చెబుతున్న నేపథ్యంలో ఇంకా అదనంగా నీటిని తీసుకునే అవకాశం ఉందన్నారు. రైతులు హెచ్‌ఎల్‌సి అధికారులతో సహకరించి నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. రైతులు తక్కువ సమయంలో ఎక్కువ దిగుబడి వచ్చేలా చర్యలు తీసుకుంటే బాగుంటుందన్నారు. ఆంధ్రాలో లైనింగ్ పనులు, వైండింగ్ పనులు ముగించి నీళ్లు తీసుకోవడం కొంత ఆలస్యమైందని అందుకు రైతులందరూ సహకరించారని కోరారు. ఈ కార్యక్రమంలో కణేకల్ సెక్షన్ డీఈ దివాకర్ రెడ్డి, జేఈ అల్తాఫ్, తుంగభద్ర జలాశయం సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్ నారాయణ నాయక్, రంజిత్ కుమార్, తుంగభద్ర జలాశయం బోర్డు మెంబర్ కేశవరెడ్డి, రాయదుర్గం మార్కెట్ యార్డ్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, మండల కన్వీనర్ బలరాం రెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ మల్లికార్జునతో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం

కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-నార్పల

అధికారులు, నాయకులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురాన్ని ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని బొందలవాడ గ్రామంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ పరిపాలన అంటే సంక్షేమ, అభివృద్ధే కాకుండా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగమే స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం అన్నారు. ప్లాస్టిక్ గ్లాస్, బాటిళ్లు చాలా ప్రమాదకర మన్నారు. ప్లాస్టిక్ బదులుగా గుడ్డ,పేపర్ వస్తువులు వాడే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పొదుపు మహిళకు గుడ్డ సంచులు, పేపర్ గ్లాసులు తయారు చేసే విధంగా యూనిట్లు ఏర్పాటు చేయాలన్నారు. చెత్త నుంచి సంపద సృష్టించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మొక్కలు ఎక్కువ నాటి పర్యావరణాన్ని కాపాడేందుకు కషి చేయాలని కోరారు. అనంతరం గ్రామంలో నిర్మించిన గోకులం షెడ్‌ను ప్రారంభించడంతోపాటు చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామ పరిశుభ్రతకు కృషి చేస్తున్న బొందలవాడ పారిశుధ్య కార్మికులను సన్మానించారు. బొందలవాడ ఎస్సీ కాలనీలో 30 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన సిమెంట్ రోడ్లు దెబ్బతిన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన కలెక్టర్ సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.50లక్షలు మంజూరు చేశారు. సర్పంచు ఆలం శిరీష, ఉపసర్పంచు వెంకట నరసానాయుడు, జిల్లా పంచాయతీ అధికారి నాగరాజారావు, ఎంపిడిఒ మమతా దేవి, తహశీల్దార్ అరుణకుమారి, డిప్యూటీ ఎంపిడిఒ శైలజారాణి, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ జనార్ధన్, స్వచ్ఛభారత్ జిల్లా కోఆర్డినేటర్ జ్యోతి, మండల విద్యాధికారులు కృష్ణయ్య, నారపరెడ్డి, ఎపిఒలు రమేష్ రామారావు, ఎర్రమ్మ, ఎపిఎం తిప్పమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, డాక్టర్ హాజీరా, వైద్యశాఖ సూపర్‌జర్ శ్రీరాములు, ఐసిడిఎస్ సిడిపిఒ భారతి, ఎఎస్ఐ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా శనివారం అనంతపురంలో అర్థనగ్నంగా ఆకులు కట్టుకుని ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

అభివృద్ధికి కాదు.. అవినీతికి వ్యతిరేకం

మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

విలేకరులతో మాట్లాడుతున్న మేయర్ మహమ్మద్ వసీం

తాము ఎప్పుడూ అభివృద్ధికి వ్యతిరేకం కాదని.. అవినీతి, అక్రమాలకు వ్యతిరేకమని మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. శనివారం నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ యేడాది పాలనలో చెప్పుకోవడానికి చేసిందేమీ లేక పదేపదే అసత్య ప్రచారాలతో కాలం గడుపుతున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమ పాలకవర్గం నగర అభివృద్ధికి కోసం రూ.59కోట్లతో 450 పనులకు ఆమోదం తెలిపిందన్నారు. ప్రస్తుతం మీరు భూమిపూజలు చేస్తున్న పనులు కూడా తాము ఆమోదం తెలిపినవేనని గుర్తించాలన్నారు. నగర ప్రజలు పన్నుల రూపంలో చెల్లిస్తున్న ప్రతి రూపాయి వృథా కాకుండా బాధ్యతాయుతంగా ఖర్చు చేయాలన్నదే తమ పాలకవర్గం లక్ష్యమన్నారు. నగర అభివృద్ధితోపాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎప్పుడూ ముందుంటామన్నారు. శనివారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో సైతం నగర అభివృద్ధికి సంబంధించి రూ.9.29 కోట్లతో చేపట్టనున్న 39 పనులతోపాటు నగరంలో లో వోల్టేజ్ సమస్య పరిష్కారం కోసం 3 చోట్ల నగర పాలక సంస్థ స్థలాలను విద్యుత్‌శాఖకు కేటాయించేందుకు ఆమోదించామన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే అసత్య ప్రచారాలు చేయడం మాని.. అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు రహంతుల్లా, శ్రీనివాసులు, కమల్‌భూషణ్, వైసిపి నాయకులు కాకర్ల శీనా, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే లక్ష్యం

ఉపాధి కల్పన అధికారిణి పల్లవి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

జిల్లాలో ఉపాధి కల్పన లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళికలతో ఈనెల 21వతేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పన అధికారి పల్లవి తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ డిగ్రీ అర్హత కలిగి 18 నుంచి 50ఏళ్ల మధ్య వయసు కలిగిన ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన యువతీ, యువకులు జాబ్‌మేళాకు హాజరు కావచ్చన్నారు. జాబ్‌మేళాకు ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతోపాటు ఆధార్, ఫాన్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ పాసు పుస్తకాలతో హాజరు కావాలన్నారు. ఇందులో ఎంఎన్‌సి లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలు పాల్గొని దాదాపు 43 మందిని రూ.30 వేల వరకూ వేతనంతో ఎంపిక చేసుకోనున్నట్లు తెలిపారు. జాబ్‌మేళాలో పాల్గొనేందుకు కార్యాలయంలోగానీ, ఆన్‌లైన్ ద్వారా కానీ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. అలాగే employment.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి తమ వివరాలను పొందుపరిచి నమోదు చేసుకోవచ్చన్నారు. ఇప్పటి వరకు 15,917 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు వివరించారు.

నేడు శ్రీవెంకటేశ్వర ఫిజియోథెరపీ క్లినిక్ ప్రారంభం

ఎస్‌విఎస్ గ్రూప్ కరస్పాండెంట్ సతీష్‌కుమార్, డైరెక్టర్ రేవంత్‌యాదవ్

కరస్పాండెంట్ సతీష్‌కుమార్

డైరెక్టర్ రేవంత్‌యాదవ్

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డు మధురానగర్ 3వ క్రాస్‌లోని ఏర్పాటు చేసిన శ్రీ వెంకటేశ్వర ఫిజియోథెరపీ క్లినిక్‌ను ప్రముఖ న్యూరో వైద్యులు డాక్టర్ జాషువా కాలేబ్ ప్రారంభించనున్నట్లు కరస్పాండెంట్ సతీష్‌కుమార్ డైరెక్టర్ రేవంత్‌యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో వారు మాట్లాడుతూ ఎస్‌విఎస్ గ్రూప్ ద్వారా విద్యార్థులకు దశాబ్దకాలంగా నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. అయితే సామాన్యులకు ఫిజియోథెరపీ వైద్యాన్ని ఉచితంగా అందించే కాంక్షతో క్లినిక్‌ను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. క్లినిక్ ద్వారా అందరికీ ఫిజియోథెరపీ వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు క్లినిక్‌లో వైద్యసేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎంపిటి ఆర్థో డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ పవన్, డాక్టర్ శ్రావణి, షేక్ జవేరియ, నాగమణి హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తండాలో సమస్యల పరిష్కారానికి కృషి

మాట్లాడుతున్న తహశీల్దార్ శేషారెడ్డి

శింగనమల : మండల పరిధిలోని తండా గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు తహశీల్దార్ శేషారెడ్డి, ఎంపిడిఒ భాస్కర్ తెలిపారు. ఎమ్మెల్యే ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు తండాలో పర్యటించిన అధికారులు డ్రెయినేజీ, సీసీ రోడ్లు, తాగునీటి వంటి సమస్యలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో తండాను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యూహెచ్‌ఒ రామాంజనేయులు, ఐసిడిఎస్‌సి డిపిఒ చల్లా లలితమ్మ, అగ్రికల్చర్ ఏవో అన్వేష్‌కుమార్, వెటర్నరీ డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, సిహెచ్ డాక్టర్ శంకర్‌నాయక్, టిడిపి మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, టిడిపి సీనియర్ నాయకుడు మారుతీనాయుడు, బండి పరశురాముడు, కాయల రమణయాదవ్, చిన్నజలాలపురం సుధాకర్, సుదర్శన్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం ఎడిఎగా అల్తాఫ్ అలీఖాన్

అనంతపురం : అనంతపురం వ్యవసాయ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా అల్తాఫ్ అలీఖాన్ నియమిస్తూ రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రధాన కార్యదర్శి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ఇప్పటి వరకూ సత్యసాయి జిల్లా హిందూపురం వ్యవసాయ డివిజన్ ఎడిఎగా పని చేస్తున్నారు. ఈనేపథ్యంలో అనంతపురం డివిజన్ ఎడిఎగా యమించారు. ఉత్తర్వులు వెలువడిన వెంటనే జిల్లా వ్యవసాయ అధికారిణి యు. ఉమామహేశ్వరమ్మను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ అనంతపురం వ్యవసాయ డివిజన్ పరిధిలోని రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం అందించే పథకాలు చేరువ చేయడానికి కృషి చేస్తానన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ఉరవకొండ : ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సహకారంతో సిఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను 30 మంది లబ్ధిదారులకు పయ్యావుల శ్రీనివాసులు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరవకొండ, వజ్రకరూరు మండలాలకు చెందిన 30 మందికి రూ.11,58,176 లక్షల చెక్కులు మంజూరైనట్లు శ్రీనివాసులు తెలిపారు.

వైసిపి రాష్ట్ర కార్యదర్శులుగా సత్యనారాయణరెడ్డి, నిట్టూరు రఘునాథరెడ్డి

నార్పల : వైసిపి రాష్ట్ర కార్యదర్శులుగా నార్పల సత్యనారాయణరెడ్డి, నిట్టూరు రఘునాథ్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు వైసిపి అధినేత వైఎస్ జగన్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి, రఘునాథ్‌రెడ్డికి పలువురు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

మహారాజశ్రీ రాయదుర్గం సివిల్ జడ్జి
(జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S. No. 165 of 2022

Between:
వేముల రామాంజినేయులు ...వాది
ఎదిరి
1. K.K.మల్లికార్జున
2. K.K.సుచేతన్ ...ప్రతివాదులు

To,
1. K.K.మల్లికార్జున S/o లేట్ తిప్పేస్వామి
2. K.K.సుచేతన్ S/o K.K.మల్లికార్జున
ఇద్దరిది డోర్ నెంబర్ 10-5-622, గాజులవీధి, రాయదుర్గం.

<u>సమ్మన్లు</u>

వాది ప్రామిసరి నోటు బాపత్తు వసూలు నిమిత్తం మీ పై, పై దావా దాఖలు చేయడమైనది. కావున మీరు పై కోర్టులో తేది 04-08-2025 న ఉదయం. 10-30 గంటలకు ఖుద్దునగానీ, వకీలు ద్వార గానీ హాజరై, అన్సరు దాఖలు చేసుకోవాలి. అట్లు మీరు హాజరు కాని యెడల, పై దావా మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియచేయడమైనది.

(By order of the court)
గౌని వెంకట రెడ్డి.
వాదితరపు న్యాయవాది, రాయదుర్గం.

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR WARANGAL,
ARB.NO. 23 of 2025

Between:
KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED., **NAKKALAGUTTA CAO** Branch, R/o.WARANGAL. ... Disputant
A N D
Ms. MALLELA.SAMSON VICTOR,& others ... Opponents

1.Ms.MALLELA.SAMSON VICTOR, S/o. FRANKLI, Aged About54years, Occ:He Is Church Father And Getting Monthly House Rents At Gorantla, R/o.D.no:1-4310,Victory Hope, in Jesus Church, Gorantla,Dist: Sri Satya Sai,Andhra Prasad-515231. Cell:9989624624.
2.AJAKAR.MALLELA JIGUNU,D/o.Abba Shariad,W/o. Victor,Aged About 49years, Occ:Senior Asst O/o P.H.C At Puttaparthi, R/o. D.no-11,Sai Sarva Colony,Opp:SSS Hospital,Near: Church, Prashanthi Gram,Puttaparthi.Dist:Sri Stya Sai,Andhra Pradesh-515134. Cell:9160600896.
3.GUTHA.JAYAPRAKASH, S/o.CHINNA RANGAPPA, Aged About53years, Occ:School Assst,O/o.Z.P.H.S At ThangeduKunta,Vanavolu,Gorantla,Dist:Anthapur,R/o.D.no:6/137,BachanapalliMdl:Vanavolu,Dist:Anantha pur, Andhra Pradesh-515134. Cell:888691005.
4.MUDDA RASAPPAGARI.GOPI,S/o.VENKATA RAMAPPA, Aged About, 55years, Occ:M.P.H Sub,O/o. P.H.C At Puttaparthi,Sri Stya Sai, R/o.D.No:4-1010,Near:Z.P.G.H School,Gorantla,Ananthapur-515234. Cell-9989558089.
5.MANAGALA.RAMADEVI,D/o.VENKATAPPA,W/o. Korimulla, Aged About 40years, Occ:Attender, O/o. P.H.C At Puttaparthi,Sri Stya Sai R/o.D.No-5-966, B.C Colony,Kothacheruvu, Ananthapur-515133. Cell:8374645479.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on **08-08-2025** for your appearance. On that day you have to appear in person at 11.00 A.M. Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATION WARANGAL,

ఫారంపాండ్ తవ్వకానికి భూమిపూజ చేస్తున్న అధికారులు

ఫారంపాండ్లు పూర్తి చేయాలి : ఎపిడి

యల్లనూరు : ఉపాధి హామీ పథకం కింద మండల వ్యాప్తంగా మంజూరైన ఫారంపాండ్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఎపిడి పుల్లారెడ్డి, ఎంపిడిఒ కరుణసాగర్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రైతుల పొలాల్లో ఫారంపాండ్లతో పాటు పశువులు షెడ్లు, వ్యక్తిగత సోక్‌పిట్లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ ఓబిరెడ్డి, ఇసి సత్యబాబు, టెక్నికల్ అసిస్టెంట్లు జయరామ్, చంద్రశేఖర్‌రెడ్డి, పురుషోత్తంనాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఖరీఫ్ ఆశలు ఆవిరి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఖరీఫ్‌సాగుపై రైతుల ఆశలు ఆదిలోనే ఆవిరైపోయాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి పదునైన వర్షాలు పడలేదు. పడిన అరకొర వర్షాలకు అక్కడక్కడ పంటలు వేసినా ఎండిపోతున్నాయి. విత్తనం పడని భూమి ఇంకా చాలా ఎక్కువగానే ఉంది. పది శాతంలోపే పంటలు సాగయ్యాయి. ఇక విత్తనం విత్తుకునే సమయం కూడా అయిపోవడంతో ఖరీఫ్‌లో ఇక ప్రధాన పంటల సాగు ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి ఏర్పడింది. వేరుశనగ పంట పది వేల ఎకరాల్లోపు సాగైంది. ఇక అదును దాటడంతో వర్షాలొచ్చినా ఇతర పంటల వైపే రైతులు మొగ్గుచూపే అవకాశముంది. కాని ప్రభుత్వం ప్రత్యామ్నాయం వైపు చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. ఇంకా ప్రధాన పంటల సాగుకు సమయముందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఆగస్టు మొదటి వారం వరకు వేరుశనగ సాగు చేసుకునే అవకాశముందని చెబుతున్నారు. కాని రైతులు మాత్రం అదును దాటినందున వేరుశనగ వేయడానికి పెద్దగా ఆసక్తి చూపే పరిస్థితిలేదు. ఎక్కువ మంది రైతులు కంది పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. అయితే కంది విత్తనాలు పూర్తి స్థాయిలో అందుబాటులో లేక వాటి కోసం రైతులు ముమ్మరంగా వెతుకులాట మొదలు పెట్టారు. ఇతర ప్రత్యామ్నాయ విత్తనాల కోసం వెతుకుతున్నారు. ఇంకోవైపు ఈ వారంలో అటు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు, హంద్రీనీవాకు నీటి విడుదల జరిగింది. హంద్రీనీవాకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నీటి విడుదల చేపట్టారు. తుంగభద్ర నీటిని శుక్రవారం విడుదల చేశారు. వచ్చే వారంలో రెండింటి ద్వారా నీరు జిల్లాకు చేరనుంది. తద్వారా ఆయకట్టు రైతుల్లో కొంత ఆందోళన తగ్గే అవకాశముంది. ఇక రాజకీయంగా ఈ వారంలో తాడిపత్రి అంశమే ప్రధానంగా ముందుకొచ్చింది. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రిలోకి అనుమతించబోమని మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి హెచ్చరికల నేపథ్యంలో శుక్రవారం తాడిపత్రికి వెళ్లేందుకు పెద్దారెడ్డి మరోమారు ప్రయత్నించారు. అయితే పోలీసులు ఆయనను గృహ నిర్బంధం చేశారు. అయితే తక్కిన నేతలు అందరూ వెళ్లి రీకాలింగ్ చంద్రబాబు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇక మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఈ వారంలో అనంతపురం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా అనంతపురం నగరంలోని డంపింగ్ యార్డు మార్పు అంశంపై తెరపైకి వచ్చింది. తమ గ్రామాల పరిధిలో ఏర్పాటు చేయవద్దంటూ నారాయణపురం, నాగిరెడ్డిపల్లి, నరసనేకుంట గ్రామాల రైతుల ఆందోళనకు దిగారు. దీనికి అన్ని రాజకీయపార్టీలు మద్దతు తెలిపాయి. అయితే అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకట ప్రసాద్ మాత్రం డంపింగ్ యార్డు మారితీరుతుందని చెబుతున్నారు. ఇది ఏమవుతుందో చూడాలి. శ్రీ సత్యసాయి జిల్లాలో రామగిరి ఎంపిపి ఎన్నిక మరోమారు వాయిదా పడింది. దాన్ని ఎలాగైనా కైవసం చేసుకోవాలన్న టిడిపి ప్రయత్నం ఈసారి కూడా విఫలమైంది. వైసిపి ఎంపిటిసిలు ఎవరూ ఎంపిపి ఎన్నిక సమావేశానికి హాజరవలేదు. దీంతో ఎన్నిక వాయిదాపడింది.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె ఉధృతం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

తమ సమస్యలు పరిష్కరించకుంటే రానున్న రోజుల్లో సమ్మెను ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్, జిల్లా కోశాధికారి గోపాల్, నగర అధ్యక్షులు వెంకటనారాయణ హెచ్చరించారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా శనివారం అర్ధనగ్నంగా ఆకులు కట్టుకుని ర్యాలీ నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ సుభాష్ రోడ్డు, టవర్‌క్లాక్ మీదుగా తిరిగి కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమ్మెపై మొండిగా వ్యవహరిస్తోందన్నారు. వెంటనే స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, పారిశుధ కార్మికులకు ఇస్తున్న వేతనం ఇవ్వాలని, షరతులు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం, గ్రాట్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, మల్లికార్జున, సంజీవరాయుడు, నగర అధ్యక్ష, కార్యదర్శులు మురళి, ఓబుళపతి, కోశాధికారి పోతులయ్య, సుబ్బిరెడ్డి, పెన్నా కిరణ్, ఆంజనేయులు, మున్సిపల్ హెల్త్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి, తిరుమలేశు లక్ష్మీనరసమ్మ, బండారి స్వామి, బత్తల ఆది, పెన్న నాగేంద్ర, గంగిరెడ్డి, శివన్న పాల్గొన్నారు.

ఆకులు కట్టుకుని మున్సిపల్ కార్మికుల నిరసన

గుత్తిలో దీక్షాశిబిరంలో కూర్చొన్న కార్మికుఉలు

గుత్తి : తమ న్యాయమైన కోరికలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం 7వరోజుకి చేరుకుంది. ఇందులో భాగంగా కార్యాలయం వద్ద శిబిరాన్ని ఏర్పాటు చేసుకొని కార్మికులు రిలే దీక్షలు చేపట్టారు. వీరికి ఎంఆర్‌పిఎస్ నాయకుఉ మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు మాతాంగి యల్లప్ప, అడవి రాముడు, కరిడికొండ శివ, రామాంజనేయులు, ఆటో అంజి, ఓబులేసు, శ్రీపురం రామంజి, శివ, రోహిత్, హరి, మున్సిపల్ ఇంజనీరింగ్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజా, రవిశంకర్, ఉపాధ్యక్షులు ఎస్‌ఎ.మురళి, రాజకుమార్, సహాయ కార్యదర్శులు నరసింహ, ఆదినారాయణ పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌లో టిఫెన్ చేస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్యే సురేంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపాలిటీ పరిధిలోని 22, 23వ వార్డుల్లో పర్యటించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ చేస్తున్న అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ కాలనీల్లో సబ్‌ప్లాన్ ద్వారా రూ.2.30కోట్లతో సీసీరోడ్లు, డ్రెయినేజీ పనులు చేయిస్తామన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి నూతన బోర్లు వేయనున్నట్లు తెలిపారు. వీటితోపాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా అనారోగ్యంతో బాధపడుతున్న భవానీకి రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. కొందరు విద్యార్థినులు నర్సింగ్ కళాశాలలో చేరాలని ఆసక్తి చూపగా సంబంధిత యాజమాన్యంతో మాట్లాడి సీట్లు కల్పించారు. అనంతరం బళ్లారి రోడ్డులోని అన్నా క్యాంటిన్‌లో భోజనం చేశారు. త్వరలో నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. శంకరప్పతోట కాలనీకి చెందిన కోలాట్ల నాగరాజుకు సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.82వేల చెక్కును బాధితునికి అందజేశారు. ఈ కార్యక్రమంలో యార్డు ఛైర్మన్ లక్ష్మీదేవి, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, టీడీపీ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లను ప్రారంభించాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

డిగ్రీ అడ్మిషన్లను ప్రారంభించడంతోపాటు తేదీలను వెంటనే ప్రకటించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, ఉపాధ్యక్షులు తరిమెల గిరి డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం నగరంలోని అంబేద్కర్ సర్కిల్లో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై రెండునెలలు కావస్తున్నా డిగ్రీ అడ్మిషన్ల ప్రారంభించకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనడానికి ఇదే ఉదాహరణ అన్నారు. డిగ్రీ ప్రవేశాలను ఆన్‌లైన్ విధానంలో కొనసాగిస్తామని చెబుతుండటంతో ఇప్పటికే చాలామంది విద్యార్థులు డిగ్రీ చదువుకు దూరం అవుతున్నారన్నారు. మరికొందరు ఇతర రాష్ట్రాల్లోని ప్రయివేట్ విద్యాసంస్థల్లో చేరి రూ.లక్షలు ఖర్చు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి డిగ్రీ అడ్మిషన్లను ఆఫ్‌లైన్ విధానంలో ప్రారంభించి తేదీలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ ముఖ్య నాయకులు నాగభూషణ్, విజయ్, సోమశేఖర్, సాయికుమార్, విజయ్, వీరు, జైవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన

నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

పెచ్చులూడిన డిఇఇ భవనం పైకప్పు

ప్రజాశక్తి - అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ లోని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గది వాకిట ముందు పైకప్పు పెచ్చులూడి కిందపడింది. అయితే పెచ్చులూడి పడిన సమయంలో తలుపుల వద్ద ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ సంఘటన జరిగిన సమయంలో అధికారులు కాంట్రాక్టర్లు ఆ గది లోపల కూర్చుని ఉండటంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పొరపాటున బయటికి వెళ్లడం కానీ లోపలికి వచ్చే సమయంలో పైకప్పు పెచ్చులూడిపడి ఉంటే తమ పరిస్థితి ఏమిటి అని ఆందోళన వ్యక్తం చేశారు. టౌన్ ప్లానింగ్ విభాగంలోని బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్ల గదిలో సైతం ఇదేవిధంగా మూడు నెలల క్రితం పైకప్పు పెచ్చులూడి కింద పడ్డాయి. దీంతో ఆ అధికారి ఆ గదిలో కూర్చోకుండా శాశ్వతంగా మూసివేసి తాళం బిగించారు. అలాగే టౌన్ ప్లానింగ్ విభాగంలోని గుమాస్తాల గదిలో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. వర్షం వచ్చిందంటే చాలు కంప్యూటర్లు ఫైళ్లపై పాత ఫ్లెక్సీలు వేసి తడవకుండా సిబ్బంది . పరిరక్షిస్తున్నారు.ం అదే పగలు కాకుండా రాత్రి అయితే వర్షం వస్తే ఫైళ్లతో పాటు కంప్యూటర్లు కూడా తడిసి పనికిరాకుండా పోయే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ పరిస్థితిని మున్సిపల్ అధికారులు పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఇంతవరకు మరమ్మతులు చేయలేదు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని వివిధ గదుల పరిస్థితి ఇలా ఉంది. కార్యాలయం వెనుక భాగంలో ఉన్న స్థలంలో నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళలపై దాడులు అరికట్టాలి : ఐద్వా

గుత్తిలో జెండాను ఎగురవేస్తున్న ఐద్వా మహిళలు

ప్రజాశక్తి-గుత్తి :

బాలికలు, మహిళలపై జరుగుతున్న దౌర్జన్యాలు, లైంగిక దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల విమర్శించారు. శనివారం పట్టణంలోని జెడ్.వీరారెడ్డి భవనంలో ఐద్వా 5వ మండల మహాసభ నిర్వహించారు. ముందుగా ఐద్వా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం నియంత్రణ అమలుకు జిల్లాలో ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలన్నారు. మహిళా చట్టాలను సమగ్రంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐదు మండల కార్యదర్శి ఎస్. రేణుక, నాయకులు రేవతి, భాను, సావిత్రి, జయమ్మ, శారద, జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మహిళా సమస్యల పరిష్కారానికి రానున్న రోజుల్లో ఉద్యమిద్దామని ఐద్వా జిల్లా నాయకురాళ్లు చంద్రిక, నగర కార్యదర్శి అశ్వని పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్డీటీ పాఠశాలలో అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం మండల 4వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు రక్షణ లేకుండా పోతోందన్నారు. రోజురోజుకూ మహిళలపై దాడులు పెరిగిపోతూనే ఉన్నాయన్నారు. మద్యం ఏరులై పారుతుండటంతోనే మహిళలను లైంగిక వేధింపులు పెరుగుతున్నాయన్నారు. ఈ పరిస్థితులలో మహిళలను చైతన్యం చేస్తూ సమస్యల పరిష్కారానికిఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షురాలుగా ఒడ్డుపల్లి నాగమ్మ, గౌరవ ఉపాధ్యక్షురాలుగా ఎస్.మునిజ, మండల అధ్యక్షురాలిగా సాకే పవిత్ర, కార్యదర్శిగా నడిపక్కతోపాటు మరో 20 మందిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి సి నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం

డి.హీరేహాళ్ : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి పవిత్ర, ఎంపిడిఒ దాసానాయక్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సాగిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే గతంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో చర్చించిన పలు సమస్యలపై వివరణ ఇవ్వకపోగా కేవలం అధికారులు వారు తెచ్చుకున్న నివేదికలను మాత్రమే చదివి మమ అనిపించారు. ఇప్పటికే జరిగిన అభివృద్ధిగానీ, జరగబోయే అభివృద్ధిపై తీసుకుంటున్న నిర్ణయాలపై ఎలాంటి వివరణ ఇవ్వకపోవడంతో పలువురు ఆశ్చర్య వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సమావేశాలు వల్ల మండల అభివృద్ధి జరుగుతుందా.. అని వైసిపి నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి మండల సర్వసభ్య సమావేశం సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని వైసిపి నాయకులు, మండల ప్రజలు కోరుతున్నారు.

చాపిరి సింగిల్‌విండో అధ్యక్షులుగా నారాయణ

కళ్యాణదుర్గం రూరల్ : కళ్యాణదుర్గం మండలం చాపిరి సింగిల్‌విండో అధ్యక్షులుగా మల్లిపల్లి నారాయణ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో అవకాశం కల్పించిన ఎమ్మెల్యే అమలినేని సురేంద్రబాబు, టిడిపి నాయకులు ధర్మతేజకు ప్రత్యేక కృతజ్ఞతలు చేశారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే సురేంద్రబాబు, టిడిపి నాయకులు దేవినేని ధర్మతేజను సన్మానించారు.

సిఐకి హెచ్‌ఎం ఫిర్యాదు

సిఐకు ఫిర్యాదు చేస్తున్న ఉపాధ్యాయులు

పుట్లూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అసాంఘిక కార్యకలాపాలపై బోధన, బోధనేతర సిబ్బంది శనివారం పుట్లూరు పోలీస్‌స్టేషన్‌లోని సిఐ సత్యబాబుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల ఆట స్థలంలో బయటి వ్యక్తులు మద్యం తాగుతూ, సీసాలను పగుల గొట్టి అక్కడే వేస్తున్నారన్నారు. దీనికి తోడు ప్లాస్టిక్ కవర్లను అక్కడే వదిలి వెళ్తున్నారన్నారు. దీంతో తమతోపాటు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సిఐ దృష్టికి తీసుకొచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం మల్లికార్జున, పిఇటి శ్రీనివాసరావు, టీచర్ రామకృష్ణారెడ్డి, రామకృష్ణ ఉన్నారు.

రాష్ట్ర విద్యా విధానాన్ని అమలు చేయాలి

ఉరవకొండ : జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేసి రాష్ట్ర విద్యా విధానం అమలు చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వేమన డిమాండ్ చేశారు. శనివారం ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ విద్యా విధానంతో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన జాతీయ విద్యా విధానం వల్ల పూర్తిగా ఉన్నత విద్య నిర్వీర్యమైపోయిందన్నారు. ముఖ్యంగా డిగ్రీ కళాశాలలు, విశ్వవిద్యాలయాలల్లో ప్రవేశాలు పూర్తిగా తగ్గిపోయాయన్నారు. కావున వెంటనే జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేసి రాష్ట్ర విద్య విధానానికి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షులు శివకుమార్, నియోజకవర్గ కన్వీనర్ భీమేష్, నాయకులు వినయ్, హరి, వంశీ, సూరి, మంజు, తదితరులు పాల్గొన్నారు.

'బంగారు' కుటుంబాల జాబితా పరిశీలన

గుమ్మగట్ట : పి.4 కింద ఎన్నికైన బంగారు కుటుంబాల తుది జాబితాపై సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 22న గోనబావి, 23న తాళ్లకెర, గలగల, 24న పూలకుంట, కలుగోడు, 25న రంగసముద్రం, మారంపల్లి, భూపసముద్రం, నేత్రపల్లి, బేలోడు, 28న 75 వీరాపురం, కెపి దొడ్డి, సిరిగేదొడ్డి, 29న గుమ్మగట్ట, గొల్లపల్లి గ్రామాల్లో సభలు ఏర్పాటు చేసి తుదిజాబితాను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

టిడిపి నాయకులకు సన్మానం

టిడిపి నాయకులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని వందశాతం పూర్తి చేసిన టిడిపి నాయకులను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ శనివారం స్థానిక కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'తొలిఅడుగు' కార్యక్రమాన్ని రికార్డు స్థాయిలో వందశాతం పూర్తి చేయడం సంతోషకరమన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని మిగిలిన బూత్‌లలో వంద శాతం పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌యాదవ్, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, టిడిపి నాయకుడు దాడి మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం

కుందుర్పి : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ చాలామంది సర్పంచులు ఆస్తులు అమ్ముకుని గ్రామాలను అభివృద్ధి చేశారన్నారు. అలాంటి సర్పంచులకు తల్లికి వందనం వంటి పథకాలు వర్తించకపోతే ఎలా అని నిలదీశారు. కాగా సమావేశానికి మండల స్థాయి అధికారులు అధిక సంఖ్యలో గైర్హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కమల నాగరాజు, ఎంపిడిఒ లక్ష్మీశంకర్, తహశీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపిడిఒ హరికృష్ణ బాలాజీ, విద్యాశాఖ అధికారి తిప్పేస్వామి, ఎపిఎం సర్దానప్ప, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వివాహిత ఆత్మహత్య

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని కోనాపురం గ్రామానికి చెందిన కురుబ జ్యోతి (38) కడుపునొప్పి తాళలేక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. కోనాపురానికి చెందిన జ్యోతి తరచుగా కడుపునొప్పితో బాధ పడుతుండేది. పలుమార్లు డాక్టర్ల వద్ద చికిత్స చేయించుకున్నా ఫలితం లేకుండా పోయింది. అనారోగ్యంతోపాటు తనకున్న ముగ్గురు ఆడపిల్లలను ఏ విధంగా చదివించుకోవాలని మదనపడి ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఇనుప దూలానికి చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నరేంద్రకుమార్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. భర్త వన్నూరుస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి..

పామిడి : అనారోగ్యంతో బాధపడుతూ పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం పామిడిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న పెద్దన్న (65) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈనేపథ్యంలో ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో తీవ్ర మనస్థాపానికి లోనై మంగళవారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో పురుగుల మందు తాగాడు. సుమారు 2 గంటల సమయంలో కుటుంబ సభ్యులు ఇంటికి రాగా అపస్మారక స్థితిలో ఉన్న ఆదెన్నను గమనించి పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధృవీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పేకాట జూదరుల అరెస్టు

కళ్యాణదుర్గం టౌన్ : పట్టణ సర్కిల్ పరిధిలోని ఐదుకల్లు రోడ్డు సమీపంలో పేకాట స్థావరంపై దాడిచేసినట్లు సిఐ యువరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పక్కాగా అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి నలుగురు నిందితులను అరెస్టు చేయడంతోపాటు రూ.60,400 నగదు, 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

'స్వచ్ఛాంధ్ర'లో వక్తల పిలుపు

రాయదుర్గంలో ర్యాలీని ప్రారంభిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

సింగిల్ యూజ్ క్యారీ బ్యాగులను నిషేధించి ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేద్దామని విప్ కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం రాయదుర్గంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ర్యాలీ విప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యారీ బ్యాగులను ఉపయోగించడం వల్ల ఏళ్ల తరబడి భూమిలో కుళ్లిపోక వాటిని పశువులు తిని అనారోగ్యానికి గురవుతున్నాయన్నారు. దీన్ని నివారించేందుకు స్థానికంగా రెండు మహిళ పొదుపు సంఘాల సాయంతో బయోడిగ్రేడబుల్ క్యారీ బ్యాగుల ఉత్పత్తి, తయారు చేయించి ప్రజలకు అందుబాటులో తీసుకువచ్చేందుకు త్వరలోనే రెండు విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలు సింగిల్ యూజ్ క్యారీ బ్యాగుల వినియోగాన్ని విడనాడాలని కోరారు. ఇకపోతే పట్టణ ప్రజలు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న విషయం తన దృష్టికి వచ్చిందని అయితే కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో ఈ పరిస్థితి వచ్చిందన్నారు. కనీసం మూడు రోజులకు ఓసారి ప్రజలకు తాగునీరు అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ దివాకర్‌రెడ్డి, తహశీల్దార్ నాగరాజు, వార్డు సభ్యులు ప్రశాంతి, జ్యోతి, మున్సిపల్ ఇంజినీర్ సురేష్, మేనేజర్ కిషోర్, మెప్మా టిఎంసి నారాయణరెడ్డి, వానిటరీ ఇన్స్‌పెక్టర్ రవీంద్ర, మాజీ వైస్‌ఛైర్మన్‌లు మహబూబ్‌బాషా, వెంకటేశులు, టిడిపి నాయకులు నాగరాజు, సంపత్‌కుమారి, భారతి, పురుషోత్తం, వేణు, రాజశేఖర్, వెంకటేశులు, మంజునాథ, తిప్పేస్వామి, కిరణ్, ప్రవీణ్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మెడికల్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.షారోన్‌సోనియా ఆధ్వర్యంలో శనివారం 2021-22 బ్యాచ్ వైద్య విద్యార్థులకు 'బీట్ ప్లాస్టిక్' అనే థీమ్ పై పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వైద్య విద్యార్థులకు ప్రశంసాపత్రం, పతకాలను అందజేశారు. అనంతరం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర సాధనకే శ్రమిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా, వైస్ ప్రిన్సిపాల్‌లు శంషాద్‌బేగం, శంకర్, సాసా నోడల్ ఆఫీసర్ శివశంకర్‌నాయక్, అసిస్టెంట్ నోడల్ ఆఫీసర్లు ఆదిరెడ్డి పరదేశీనాయుడు, నరసింహనాయక్, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ వాల్మీకి శ్రీనివాస్, సీనియర్ ప్రొఫెసర్లు సరళ, శాంతిరెడ్డి, దుర్గ, పద్మ శ్రావణి, భవాని, సుమన్‌కుమార్, నీరజ, ఉమాదేవి, సరోజ, హైమావతి, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం టౌన్ : స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర నిర్మాణానికి కంకణ బద్దులవుదామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు. 'స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం పటణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే అమిలినేని సిబ్బందితో ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ వసంతబాబు, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, యార్డు ఛైర్మన్ లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కళాశాల వైస్‌ఛైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నగరంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని జండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ ఎ.శ్రీనాథ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి జి.ఆనంద్‌బాబు, వాలంటీర్లు గౌతమి, తరుణి, కృతిక, మల్లేశ్వరి, ఫర్హాత్, నవిత, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపల్ కమిషనర్ నయీమ్‌అహ్మద్ ఆధ్వర్యంలో మెప్మా, శానిటేషన్ అధికారులు, సిబ్బంది స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి పొట్టి శ్రీరాములు కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సింగిల్ ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, అసిస్టెంట్ కమిషనర్ మల్లెల లక్ష్మీదేవి, మెప్మా టిపిఆర్ఒ మోహన్, రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ ఎర్రిస్వామి, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు చంద్రశేఖర్, వేణుగోపాల్‌రెడ్డి, మెప్మా సిఒలు, అర్పీలు సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నగరంలోని జిల్లా గ్రంథాలయంలో సిబ్బంది, పాఠకులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ పి.కమ్మన్న, సహా గ్రంథాలయాధికారి డి.గోవిందు, జిల్లా గ్రంథాలయ సంస్థ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

డి.హీరేహాల్ : స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా ప్లాస్టిక్‌ను వాడమని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ హనుమంతురెడ్డి, టిడిపి మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ప్రత్యేకాధికారి నాగేశ్వరరావు, తహశీల్దార్ శ్రీనివాసులు,హెచ్‌ఎం అబ్దుల్ మునాఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పామిడి : స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర సాధనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని డిడిఒ విజయలక్ష్మి పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. తర్వాత పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ తేజోష్ణ, డిప్యూటీ ఎంపిడిఒ అశ్వర్థనాయుడు, ఎపిఒ ఆదినారాయణమ్మ, పంచాయతీ జూనియర్ అసిస్టెంట్లు ఖాజాహుస్సేన్, రవి, బిల్ కలెక్టర్ నాగరాజు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ సురేష్, వీఆర్వో గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల పరిధిలోని గూగూడులో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపి అంబికా లక్ష్మీనారాయణ పాల్గొని ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. ముందుగా గ్రామంలోని కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఎంపి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. కావున ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. త్వరలోనే గూగూడులో రూ.25 లక్షలతో అధునాతనమైన గెస్ట్‌హౌస్ నిర్మించనున్నట్లు తెలిపారు. అలాగే స్థలాన్ని చూపిస్తే ఉద్యానవనాన్ని కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం పంచాయతీ కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆకుల ఆంజనేయులు, ఆలం వెంకట నరసానాయుడు, బండ్లపల్లి కుళ్లాయప్ప, ఎర్నాగప్ప, జాఫర్‌వలి, ఓబులేసు, నరసింహులు, ఎంపిడిఒ మమతాదేవి, డిప్యూటీ ఎంపిడిఒ శైలజారాణి, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ జనార్ధన్, ఆలయ కార్యనిర్వహణాధికారి సాకేతపురం శోభ, ఆలయ ప్రధాన అర్చకులు ఉసేనప్ప ఉపాధి హామీ ఏపీఒలు రమేష్ రామారావు, ఎర్రమ్మ, ఎపిఎం తిప్పమ్మ, పంచాయితీ కార్యదర్శులు శ్యామల, శ్రీనివాసులు, కీర్తన వెలుగు సీసీలు రామకృష్ణ, రామచంద్ర, నాగరత్నమ్మ, ఎఎస్ఐ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల మండలం గూగూడులో మొక్క నాటుతున్న ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం కలెక్టరేట్ : ప్లాస్టిక్ రహిత బ్యాగులు తయారీలో త్వరలో వరల్డ్ సాధిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం నగరంలోని పాతూరులో మున్సిపల్, మెప్మా సిబ్బందితోపాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, టిడిపి నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్లాస్టిక్ రహిత నగరం కోసం తాము పని చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం నగరపాలక సంస్థ వద్ద మెప్మాతో పాటు డిస్కవరీ అనంతపురం అనిల్ ఆధ్వర్యంలో తయారు చేసిన ప్లాస్టిక్ రహిత బ్యాగుల కేంద్రాన్ని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రారంభించారు. ఇక్కడ ప్లాస్టిక్ కవర్లు, స్పూన్లు, ఇతర కప్పుల స్థానంలో ఏ వస్తువులు వినియోగించవచ్చో అన్నదానిపై అవగాహన కూడా కల్పించారు. డిస్కవరీ అనంతపురం అనిల్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ రహిత బ్యాగులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బాలస్వామి, అడిషనల్ కమిషనర్ పావని, మెప్మా పీడీ విశ్వజ్యోతి, కార్పొరేటర్లు జనబలం బాబా, బాలాంజనేయులు, నాయకులు పోతుల లక్ష్మీనరసింహులు, పిఎల్ఎన్ మూర్తి, పరమేశ్వర్, బల్లా పల్లవి, రంగాచారి, పావురాల శేఖర్, గుర్రం నాగభూషణం, తొండపునాటి రమేష్, సాకే లక్ష్మీనరసింహ, ఫిరోజ్ అహ్మద్, మోహన్‌కుమార్, రాయల్ మధు, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం రూరల్ : 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ కె శ్రీధర్, ఎకో క్లబ్ కన్వీనర్ శశికిరణ్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హర్షలత, వైస్ ప్రిన్సిపాల్ శేషయ్య, ఎన్ఎస్ఎస్ అధికారులు శ్రీధర్, రవిశంకర్, ఎకో క్లబ్ కన్వీనర్ శశికిరణ్, అధ్యాపకులు షోకత్‌అలీ, రాధాకృష్ణ, గురుమోహన్, కలిముల్లా, చక్రవర్తి, రుక్మిణి, విద్యార్థులు పాల్గొన్నారు.

అనంతపురం : స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణలో శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఇబి దేవి, కార్యాలయ పరిపాలన అధికారి గిరిజా మనోహర్‌రావు, ప్రోగ్రాం అధికారులు యుగంధర్, నారాయణస్వామి, విష్ణుమూర్తి, నరేంద్రరెడ్డి, హెచ్ఇఇఒ నాగరాజు, డెమో త్యాగరాజ్, ఆరోగ్య బోధన అధికారి గంగాధర్, పిఎంఒ నాగన్న, ఎన్‌హెచ్‌ఎం కిషోర్‌కుమార్, ఫణి, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రూరల్ గ్రామ పంచాయతీ సర్పంచు ఉదయ్, ఎంపిడిఒ దివాకర్ సూచించారు. 'స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన సభ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ, మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ వెంకట్‌నాయుడు, అనంతపురం రూరల్ పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలో ర్యాలీ, మానవహారం ఏర్పాటు చేసి ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సునీతమ్మ, ఎంపిడిఒ సొలమన్‌రాజ్, తహశీల్దార్ శ్రీధర్, సర్పంచు పార్వతి, డిఆర్‌డిఎ ఎపిఎం అనిత, టిడిపి నాయకులు నారాయణస్వామి, పొడరాళ్ల రవీంద్ర, ఉద్యోగులు రామ్, సతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి : మండల కేంద్రంలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక మినీ అంగన్వాడీ కేంద్రం ఆవరణలో మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఒ లక్ష్మీశంకర్, డిప్యూటీ ఎంపిడిఒ హరికృష్ణ బాలాజీ, అంగన్వాడీ సూపర్‌వైజర్ పద్మావతి, పంచాయతీ కార్యదర్శులు హరీష్, అశోక్, ఎస్‌బిఎం ఎంసిఒ నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండల కేంద్రంతోపాటు ఉద్దేహాల్, గోవిందవాడ, శ్రీధర్‌ఘట్ట, లింగదహాల్, గేనేహాల్, సింగేపల్లి, చంద్రగిరి, కళ్లుహోళ, దేవగిరి, నెమకల్లు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐకెపి రామకృష్ణ, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం : నగరంలోని జీసస్‌నగర్‌లో ఉన్న భాష్యం విద్యాసంస్థల విద్యార్థులు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. టవర్ క్లాక్ నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా భాష్యం స్కూల్ వరకూ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా 'ప్రకృతిని నాశనం చేయొద్దు- భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు', 'పరిశుభ్రత పాటిద్దాం- ప్రకృతిని కాపాడుదాం', మొక్కలు నాటండి-భవిష్యత్తును కాపాడండి' అంటూ నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల రాయలసీమ సీఈవో అనిల్‌కుమార్, ఛైర్మన్ రామకృష్ణ, వైస్‌ఛైర్మన్ హనుమంతరావు, డైరెక్టర్ సాకేత్ రామ్, సీఈఓ అనిల్‌కుమార్, జిల్లా జెడ్ఇఒ రవివర్మ, ప్రిన్సిపాల్ బాలకృష్ణ, హెచ్‌ఎం షకీలా బేగం, విద్యార్థులు పాల్గొన్నారు.

అనంతపురంలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న డిఎంహెచ్ఒ ఇబి దేవి, వైద్య సిబ్బంది